క్లుప్తంగా

బీసీడీఈ మోడల్ ఇన్‌స్టిట్యూట్‌గా నలంద



లబ్బీపేట(విజయవాడతూర్పు): బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్(బీసీడీఈ) లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ పైలెట్ ప్రాజెక్ట్ మోడల్ ఇన్‌స్టిట్యూట్‌గా నలంద డిగ్రీ కళాశాల ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం. అనురాధ తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆ కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులు ప్రేరణ మిత్ర యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకుని దానిలోని మాడ్యూల్స్ ద్వారా 13 ప్రైమరీ గవర్నమెంట్ స్కూల్స్‌లో విద్యార్థులకు అనేక అంశాల్లో బోధిస్తారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థుకు శుక్రవారం స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సమగ్ర శిక్ష బి. శ్రీనివాసరావు, బీడీసీఈ కార్యదర్శి ఎంఎల్ఎస్ దేవకుమార్, శేషగిరి మధుసూదనరావు తదితరులు సర్టిఫికెట్స్ అందజేశారు.

జగన్మాతకు నృత్య కళార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీసాయిరామ్ నృత్య అకాడమీకి చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నాట్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద కళావేదికపై భాగవతుల శ్రీనివాస్ శర్మ పర్యవేక్షణలో పలువురు కళాకారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు ఆద్యంతం నృత్య ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లోని ఉపాలయంలో కొలువై ఉన్న శ్రీ అయ్యప్పస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మనక్షత్రం, జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకూ కేరళ సంప్రదాయ పద్ధతుల్లో స్వామి వారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం గణపతి హోమంతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం 108 దంపతులతో సర్వఐశ్వర్య పూజ (కేరళ పద్ధతిలో)ను జరిపించారు. అనంతరం అయ్యప్ప స్వామి వారికి అష్టాభిషేకం, నవరసాభిషేకం తదుపరి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటల నుంచి పడిపూజను జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాలను అయ్యప్పస్వామి ఆలయ ప్రధానార్చకుడు కె. మురళీధరన్‌నంబూద్రి ఆధ్వర్యంలో కొనసాగగా, దేవస్థాన కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

బాబా ప్రశాంతి నిలయంలో..

అయ్యప్ప స్వామి వారి జయంతిని పురస్కరించుకొని శ్రీ ఈశ్వర పుత్ర భక్త బృందం ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట బాబా ప్రశాంతి నిలయంలో స్వామి వారి పంచలోహ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. గురుస్వామి కామరాజ్ హరీష్‌కుమార్ ఆచారి, బాబా ప్రశాంతి నిలయం నిర్వాహకులు భోగవల్లి పృథ్వీ సాయికుమార్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమాలను నిర్వహించారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



బస్టాండ్(విజయవాడపశ్చిమ): ఏపీపీటీడీ (ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్)లో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు విజయవాడ గవర్నర్‌పేట–2 డిపో ఎదుట నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.వి రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం, సంస్థ కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లో కుక్కల స్వైరవిహారం

భయాందోళనలో ప్రయాణికులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నగరంలో ఏ వీధిలో చూసినా కుక్కల స్వైర విహారంతో స్థానికులు వీధుల్లో తిరగాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉంది. ఇటీవల గుంటూరులో కుక్కల దాడిలో బాలుడు మృతిచెందిన ఘటనతో ప్రజలు మరింత భయాందోళనకు గురవుతున్నారు. ఈ సమస్య రోడ్లు, వీధుల్లోనే కాకుండా విజయవాడ రైల్వే స్టేషన్‌లో కూడా తీవ్రంగా ఉంది. ప్రతి రోజు లక్షల్లో ప్రయాణికులు రాకపోకలు సాగించే విజయవాడ రైల్వే స్టేషన్‌లో కుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

గుంపులు గుంపులుగా..

విజయవాడ రైల్వే స్టేషన్‌లో పది ప్లాట్‌ఫాంలు ఉండగా.. వాటిపై నిత్యం కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రయాణికులను హడలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా 1, 6, 7 ప్లాట్‌ఫాంలతో పాటుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలపై చేరి అటుగా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. కొన్ని సందర్భాలలో వారిపై దాడులకు సైతం పాల్పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. ముఖ్యంగా రైలు ఎక్కే సమయం, దిగే సమయంలో ప్రయాణికులు హడావుడిగా పరుగులు తీస్తున్న సమయంలో కుక్కలు వారి వెంటపడుతుండటంతో వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎక్కడ అవి దాడి చేస్తాయోనని కంగారుపడుతున్నారు. ఒక్కోసారి ప్రయాణికులు రైలు కోసం వేచి ఉండే సమయంలో కుక్కలు ఒకదానిపై ఒకటి దాడులు చేసుకుంటూ ప్రయాణికులపై పడుతూ భయాందోళనకు గురిచేస్తున్న ఘటనలూ చోటుచేసుకుంటున్నాయి.



విజయవాడ స్టేషన్‌లో ప్రయాణికుల మధ్యే తిరుగుతున్న కుక్క

అధికారులు దృష్టిపెట్టాలి..

రైలు ఎక్కే సమయంలో హడావుడిగా పరుగులు తీస్తున్న ప్రయాణికుల వెంట పడి కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయని, దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. ప్రతి రోజు లక్షల మంది ప్రయాణికులు వచ్చి వెళ్లే రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని, ఆ దిశగా స్టేషన్ లోపల, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.



స్టేషన్‌లోని ఫుట్ బ్రిడ్జిపై చేరిన కుక్కలు

భక్తులకు అన్న ప్రసాద వితరణలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అయ్యప్ప స్వామి వారి జయంతిని పురస్కరించుకుని చిట్టినగర్ పరిధిలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భక్తులకు అన్న ప్రసాద వితరణలు జరిగాయి. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి వారి ఆలయంలోని అయ్యప్ప స్వామి వారి ఆలయంలో తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలను ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ నిర్వహించారు. అనంతర స్వామి వారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించగా, పెద్ద ఎత్తున భక్తులు, ఉభయదాతలు తరలి వచ్చారు. ఆలయాన్ని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఉత్సవాలను ఆలయ ఈవో వై. సీతారామయ్య, చైర్మన్ నందిపాటి నాగ వెంకట శ్రీనివాస రావు పర్యవేక్షించారు.

ధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో..

కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లో శ్రీ ధర్మశాస్త్ర సేవ సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి వారి జన్మదినాన్ని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దేవిన శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అయ్యప్ప స్వామి వారికి వెస్ట్ ఏసీపీ దుర్గారావు, మురళీ నంబ్రూది పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీ, మరుపిళ్ల రాజేష్, అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షుడు వి. వెంకట్రావు పాల్గొన్నారు.

ముగిసిన అయ్యప్ప కోటి నామజపం

వాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో గురుస్వామి భైరవ రాము ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అయ్యప్ప కోటి నామ జప మహాయజ్ఞం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమంలో భాగంగా ఉదయం స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



వాగు సెంటర్లో విశేష అలంకరణలో స్వామివారు



అన్న ప్రసాదాన్ని వడ్డిస్తున్న వెస్ట్ ఏసీపీ దుర్గారావు

ఒక్క హామీనీ నిలబెట్టుకోలేదు

కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ వెస్ట్ ఇన్‌చార్జి వెలంపల్లి మండిపాటు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ క్లస్టర్‌ల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో వెలంపల్లి శ్రీనివాసరావు ఆయన కార్యాలయంలో శుక్రవారం రాత్రి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రారంభించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలవుతున్నా ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉంటే ఇప్పటికే అమ్మఒడి, విద్యాదీవెన వంటి అనేక పథకాలు ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరేదన్నారు. కూటమి ప్రభుత్వానికి ఎందుకు ఓట్లు వేశామా? అని ప్రజలు తలలు బాధుకుంటున్నారన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల సమస్యలపై పార్టీ తరఫున, ప్రజల పక్షాన నిలబడి పోరాడాలన్నారు. నియోజకవర్గం పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేసి తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని కోరారు.



మాట్లాడుతున్న వెలంపల్లి శ్రీనివాసరావు

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అత్తింటి వేధింపులపై వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట నైజాం గేటు ప్రాంతానికి చెందిన వేము శ్రావణి, శివకుమార్ భార్యభర్తలు. వీరికి 2022 ఫిబ్రవరిలో వివాహం కాగా ఇద్దరు సంతానం. కొంత కాలంగా మద్యం తాగుతూ భర్త తనను వేధింపులకు గురి చేస్తున్నాడు. భర్తకు అత్త, మామ సపోర్టుగా నిలవడమే కాకుండా తనకు ఇష్టం లేకపోయినా రెండో సంతానమైన హాస్సికను ఆడపడుచు ఇందిరారాణికి దత్తత ఇచ్చారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

సెలవు రోజుల్లో కూడా పనిచేయనున్న క్యాష్ కౌంటర్లు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థకు చెల్లించే ముందస్తు పన్నుల చెల్లింపుదారుల కోసం సెలవు రోజుల్లో కూడా క్యాష్ కౌంటర్లన్నీ అందుబాటులో ఉంచుతున్నట్లు వీఎంసీ డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉత్తర్వుల మేరకు ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయలపై 50% వడ్డీ రాయితీ, 2025– 26నకు ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. ఈ నెల 30 తేదీ వరకు నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఉన్న 13 క్యాష్ కౌంటర్లు, 286 సచివాలయాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. పన్నుల చెల్లింపుదారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో కూడా అవకాశం కల్పించిందని, www.cdma.apgov.in వెబ్‌సైట్ ద్వారా, పురమిత్ర యాప్‌ద్వారా కూడా పన్నులు చెల్లింపులు చేయవచ్చని తెలిపారు.

మైనార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి



వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మైనార్టీలు

వక్ఫ్ చట్టం వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్

వించిపేట(విజయవాడపశ్చిమ): వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా వక్ఫ్ చట్టం వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీల మహిళలు, యువకులు, మత పెద్దలు పెద్ద సంఖ్యలో నల్లజెండాలతో శుక్రవారం సాయంత్రం నిరసన ప్రదర్శన చేపట్టారు. వించిపేట, నైజాంగేటు సెంటర్ నుంచి పంజాసెంటర్ మీదుగా కృష్ణవేణి క్లాత్‌మార్కెట్ వరకు నల్లజెండాలు, ప్లకార్డులను చేతపట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో పాల్గొన్న హుదా మసీదు ఇమామ్ మొహమ్మద్ మొహజం మాట్లాడుతూ వక్ఫ్ నల్ల చట్టం రాజ్యాంగ విరుద్ధమని, ముస్లింలందరూ సంఘటితంగా జెండాలు పక్కన పెట్టి వక్ఫ్ అజెండాపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ముస్లింలకు అన్యాయం..

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా వక్ఫ్ సవరణ నల్లచట్టాలతో ముస్లిం సామాజిక వర్గానికి తీరని అన్యాయం చేస్తే, దానికి చంద్రబాబు నాయుడు మద్దతు ప్రకటించి ద్రోహం చేశారన్నారు. ముస్లింలను మోసం చేసిన టీడీపీ ప్రభుత్వంలోని మైనార్టీ మంత్రి ఫరూక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్, ఇతర పదవుల్లో ఉన్న మైనారిటీ నాయకులు వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా, ఎంఐఎం నాయకులు సమీర్, మైనార్టీ నాయకులు వాజిద్ ఖాన్, జీఎంసీ అల్తాఫ్, ఎండీ ఫరూక్, అజ్మి, ఎస్‌డీ సలీం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ‘నమస్తే’ పథకంపై అవగాహన

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం రాజరాజేశ్వరిపేట శానిటరీ ఇన్‌స్పెక్టర్ బిల్డింగ్‌లో రాగ్ పిక్కర్స్ సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. రాగ్ పిక్కర్స్ సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అందించే ‘నమస్తే పథకం’తో ఎంతో మంచి చేకూరుతుందన్నారు. రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా, పిల్లల ఉన్నతమైన చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఒక వెహికల్ సమకూర్చినందుకు సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. అర్హులైన వారి ఆధార్ కార్డు లింకేజ్ చేస్తూ, వారికి జీరో బ్యాలెన్స్ అకౌంటు బ్యాంకులో తెరిచేందుకు తాము ప్రొఫైలింగ్ చేస్తున్నామని చెప్పారు. ఈ పథకానికి నోడల్ ఆఫీసర్‌గా డాక్టర్ బాబు శ్రీనివాస్‌ను నియమించామని, రాగ్ పిక్కర్స్‌కు ఏవైనా సందేహాలుంటే ఆయన అందుబాటులో ఉంటారని తెలిపారు. స్వర్ణాంధ్ర కార్పొరేషన్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్, దళిత్ బహుజన్ రిసోర్స్ సెంటర్ సీఈవో అల్లాడి దేవకుమార్, డెప్యూటీ డైరెక్టర్ శామ్యూల్ అనిల్ కుమార్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాల్ కృష్ణ నాయక్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

వీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరం నిరంతరం శుభ్రంగా ఉండాలని, ప్రధాన వీధుల నుంచి సందుల వరకు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా సర్కిల్–1 పరిధిలో గల గాంధీ హిల్, పరిసర ప్రాంతాలలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జెండా చెట్టు వద్ద ఉన్న లోడర్ పాయింట్ పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, రోడ్లపైన వ్యర్థాలు ఎవరూ వేయకుండా ఎప్పటికప్పుడు ఇంటి వద్దే సేకరణ చేసేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అధికారులను ఆదేశించారు. గాంధీ హిల్ వద్ద అవుట్ ఫాల్ డ్రెయిన్లో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎక్సలేటర్ ద్వారా తీస్తున్న వ్యర్థాలను పరిశీలించి ఎప్పటికప్పుడు వ్యర్థాలన్నీ తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గాంధీ మహిళా కళాశాల వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. టోకెన్లు సమయానికి ఇస్తున్నారా లేదా, అన్న క్యాంటీన్ సమయపాలన పాటిస్తున్నారా లేదా, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు లేదా వంటి అంశాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలు ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాల కృష్ణ నాయక్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బడుగుల ఆశా‘జ్యోతి’కి ఘన నివాళి

ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. కేఎల్‌రావునగర్లోని బీసీ ఇంటర్నేషనల్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్వీ రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నమ్మి అప్పారావు, కోశాధికారి అవ్వారు బుల్లాబ్బాయ్, బాయన శేఖర్‌బాబు తదితరులు హాజరయ్యారు. బీసీలు విద్యా, ఉద్యోగాలతో పాటు రాజకీయంగా రాణించాలని అతిథులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యులు చంద్రగిరి రాధాకుమారి, ప్రముఖ పాత్రికేయులు అన్నవరపు బ్రహ్మయ్య, శివకుమార్ పట్నాయక్, దుర్గాప్రసాద్, కొల్లి రాంబాబు పాల్గొన్నారు.

బీసీ హక్కుల సాధన సంఘం ఆధ్వర్యంలో..

కేటీరోడ్డులోని బీసీ హక్కుల సాధన సంఘం కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో సంఘ వ్యవస్థాపకులు వెంకట రమణ, కోళ్ల రజనీ, కొరికాని నాగు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథులుగా సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్పొరేటర్ బోయి సత్యబాబు, మాజీ కార్పొరేటర్ కోళ్ల సుధారాణి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. సంఘ ప్రధాన కార్యదర్శి జగడం శ్రీనివాస్, కె.నరేంద్ర, కొత్తకొండ నరసింహారావు, మజ్జి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



పూలే జయంతి వేడుకల్లో కార్పొరేటర్లు, నాయకులతో కలిసి పాల్గొన్న మేయర్ భాగ్యలక్ష్మి



పూలేకు నివాళులర్పిస్తున్న ఏపీ బీసీ సమన్వయ కమిటీ మహిళా విభాగం సభ్యులు

స్ఫూర్తి ప్రదాత జ్యోతిరావు పూలే

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంఘ సంస్కర్త, మానవతావాది, స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలేకు పలు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. పూలే జయంతి సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఏపీ బీసీ సమన్వయ కమిటీ మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీ తులసి, కమిటీ రాష్ట్ర చైర్‌పర్సన్ ఐ. వేమేశ్వరి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ ఐక్య వేదిక నగర శాఖ అధ్యక్షుడు పీఎల్ఎస్ రాజు, కమిటీ కన్వీనర్ కె. ఉమావల్లి, సభ్యులు జొన్నలగడ్డ పద్మ, రామలక్ష్మి, ఆర్. శ్రీనివాసరావు, కె. నరసింహారావు, లక్ష్మి పాల్గొన్నారు.

ఏపీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, ఏపీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీవీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గౌర్తి శ్రీనివాస చక్రవర్తి ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డాక్టర్ విశ్వనాథ్, బీసీ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహాత్మునికి మహా నివాళి

వించిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక బ్రాహ్మణ వీధిలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజవర్గ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొని కార్పొరేటర్లు, మాజీ చైర్మన్‌లు, పార్టీ నాయకులతో కలసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, షేక్ ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, శిరంశెట్టి పూర్ణచంద్రరావు,తోలేటి శ్రీకాంత్, పార్టీ నాయకులు పోలిమెట్ల శరత్, దేరంగుల రమణ, మజ్జి శ్రీనివాస రావు, శీరం వెంకటరావు, బూదాల శ్రీను, దుక్క హరిభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ హక్కుల సాధన సంఘం సభ్యులు



పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొన్న బీసీ ఇంటర్నేషనల్ అసోసియేషన్ సభ్యులు



పూలేకు నివాళులర్పిస్తున్న ఏపీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా సబ్ స్టేషన్ పరిధిలోగల 11 కేవీ కామకోటినగర్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులతోపాటు మెయింటెనెన్స్ నిమిత్తం కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. రవీంద్రబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు జోజినగర్, లక్ష్మీనగర్ కాలనీ, చర్చి రోడ్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, టీవీ కృష్ణారావు వీధి, ఆర్కే పబ్లిక్ స్కూల్ ఏరియా, బీరువాల కంపెనీ రోడ్, మానవ మందిరం రోడ్, కోళ్ల ఫారం రోడ్ తదితర ఏరియాల్లో కరెంట్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన వివరించారు.

చిట్టినగర్ సెక్షన్ పరిధిలో..

చిట్టినగర్ సెక్షన్ కేఎల్‌రావు నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోగల 11 కేవీ టైలర్ పేట ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రవీంద్రబాబు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు కార్మేల్ చర్చి రోడ్, వైశ్య కాలనీ, మోతీ మసీదు, పెట్రోల్ బంకు ఎదురుగా, జోడు బొమ్మల సెంటర్, రైల్వే కాలనీ, ఫ్రైజర్ పేట తదితర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపి వేయనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.